

మొదటి పంటతోనే మోడువారి కన్పిస్తున్న పత్తి చేను

నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, సోమవారం 28 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

## దుష్ప్రచారం సరికాదు



### ఫ్యామిలీ వేడుకను వక్రీకరిస్తూ కేసులు తగవు: వద్దిరాజు

మామిళ్లగూడెం, అక్టోబర్ 27: ఫ్యామిలీ వేడుకను రేవ్ పార్టీగా దుష్ప్రచారం చేస్తూ కేసులు బనాయించడం సరైనది కాదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఈ దుష్ప్రచారాలను, తప్పుడు కేసులను ఆదివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాజ్ పాకాల తన కుంటుంబ సభ్యులతో కలిసి ఉంటున్న నివాసంపై పోలీసులు దాడి చేసి రేవ్ పార్టీ అంటూ తప్పుడు ప్రచారం చేస్తుండడం అభ్యంతరకరమని అన్నారు. ప్రభుత్వ పెద్దలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇలా డైవర్షన్ పాలిటిక్స్ ప్లే చేస్తున్నారని, ప్రతిపక్షానికి చెందిన ప్రముఖ నాయకులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ఇతర ప్రముఖుల ప్రతిష్టను దిగజార్చాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# పత్తి రైతు చిత్తు

- మద్దతు ధరలేక తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- కనిష్ఠ స్థాయికి పడిపోయిన దిగుబడులు
- అన్నదాతకు శాపంగా మారిన తేమ శాతం
- అదునుచూసి దెబ్బ కొడుతున్న ప్రైవేట్ వ్యాపారులు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తి బస్తాలు

| | |
|---|---|
| నిరుడు ప్రైవేట్ ఖరీదుదారులు కొనుగోలు చేసిన పంట | 5,87 344 క్వింటాళ్లు |
| నిరుడు సీసీఐ కొనుగోలు చేసిన పంట | 4, 40 170 క్వింటాళ్లు |
| ఈ ఏడాది ప్రైవేట్ ఖరీదుదారులు కొనుగోలు చేసిన పంట | 4,432 మెట్రిక్ టన్నులు |
| ఈ ఏడాది సీసీఐ కొనుగోలు చేపిన పంట | 33 మెట్రిక్ టన్నులు |
| ప్రకటించిన చేసిన సీసీఐ కేంద్రాలు | 9 |
| ప్రారంభించిన సీసీఐ కేంద్రాలు | 3 |

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 27: బహిరంగ మార్కెట్లో తెల్ల బంగారం ధరలు తిరోగమనం దిశకు చేరుతుండడంతో పంటను సాగు చేసిన రైతులు చిత్తు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాణిజ్య పంటల్లో ఎక్కువ డిమాండ్ ఉన్న పత్తిని ఉమ్మడి జిల్లా రైతులు గడిచిన కొన్నేళ్లుగా ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. అనువైన నేలలు పుష్కలంగా ఉండడంతో దశాబ్దాలుగా రైతులు పత్తి సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. అదే తరహాలో ఈ ఏడాది కూడా ఏకంగా 2.10 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. సాగు ఆరంభంలో భౌగోళిక, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం, గులాబీరంగు పురుగు ఉధృతి కూడా లేకపోవడం వంటి కారణాలతో రైతులు రెట్టింపు ఉత్సాహంతో సస్యరక్షణ చర్యలు చేపట్టారు. తీరా పంట పూత, కాత దశకు చేరుకునే సమయంలో ఒక్కసారిగా వరుస తుపాన్లు, రికార్డు స్థాయి వర్షాలు, భారీ వరదలు వచ్చాయి. దీంతో పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశ ఎదురైంది. వరదల కారణంగా కొన్ని మండలాల్లో ఈ పంట మొత్తానికే తుడిచిపెట్టుకుపోయింది. వర్షాలను తట్టుకొని పంట నిలిచిన ప్రాంతాల్లో పత్తి ఎర్రబారడం, చీడపీడల ఆశించడం వంటివి ఒక్కసారిగా పెరిగాయి. దీంతో పంటను కాపాడుకునేందుకు రైతులకు మరింత పెట్టుబడి భారం పెరిగింది. అప్పటికే మార్కెట్లో పత్తి ధర క్వింటాకు రూ.8 వేల వరకు పలుకుతుండడంతో మద్దతుకు మంచి ధర వచ్చే అవకాశం ఉందని రైతులు అంచనా వేశారు. తీరా కొత్త పంట మార్కెట్‌కు చేరుకునే సమయంలోనే ప్రైవేట్ ఖరీదుదారులు వారి మాయాజాలానికి తెరతీశారు. దీంతో నెల రోజుల నుంచి పత్తి ధరలు పతనమవుతూ వస్తున్నాయి. పేరుకు మాత్రం ఒకటీ రెండు లాట్లకు గరిష్ఠ ధర ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ చూపుతున్నారు. మిగిలిన పంటకు రూ.5,500 నుంచి రూ.6,500 వరకే ధర పెడుతున్నారు. అయితే భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మరింత ప్రయోజనం ఉంటుందని భావించిన అధికారుల అంచనాలు కూడా తలికిందులవుతున్నాయి.

### కనిష్ఠ స్థాయికి పంట దిగుబడి..

గడిచిన మూడు నాలుగు దశాబ్దాలుగా జిల్లాలో పత్తిసాగు గణనీయంగా పెరుగుతోంది. మార్కెటింగ్‌కు అనువైన అవకాశాలు, జిన్నింగ్ మిల్లులు ఉండడంతో ఇదే అదునుగా భావించి రైతులు.. తెల్లబంగారం సాగు చేస్తున్నారు. అయితే రాన్రానూ బీటీ విత్తనాల్లో నాణ్యతా లోపం, కాస్త భిన్నమైన వాతావరణం కారణంగా ఈ ఏడాది తీవ్రనష్టాలను మిగిల్చింది. సాధారణంగా ఎకరానికి పంట సాగు దిగుబడి 10 – 15 క్వింటాళ్లు వస్తుంది. అయితే ఈ ఏడాది ఎకరానికి 4 – 5 క్వింటాళ్లు మాత్రమే వస్తుందని రైతులు చెబుతున్నారు. దీంతో సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు కూడా పూడే అవకాశం లేదని వాపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఎకరానికి రూ.15 వేల కౌలు చెల్లించి, మరో రూ.30 వేలు పెట్టుబడి పెట్టి పత్తిని సాగు చేస్తే.. కనీసం సగానికి సగం కూడా ఆదాయం వచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సీసీఐ ఉన్నట్టే.. మద్దతు ధర రానట్టే..

ప్రైవేట్ మార్కెట్లో రైతులకు మద్దతు ధర రావడం కష్టమని భావించిన సర్కారు.. సీసీఐ కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయినప్పటికీ అక్కడ ఆశించిన మేర ప్రయోజనం కలగడం లేదు. సీసీఐ మార్గదర్శకాల ప్రకారం పంటలో తేమ శాతం 8 – 12 శాతం మాత్రమే ఉండాలి. అయితే జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల వల్ల, మరికొద్ది రోజుల్లో మంచు, చలి తీవ్రత పెరిగే ప్రమాదం ఉన్నందు వల్ల 12 శాతంలోపు తేమ నమోదయ్యే అవకాశాలు తక్కువని జిన్నింగ్ మిల్లుల యజమానులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ వ్యాపారులు సుమారుగా 5 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. అయితే ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 9 జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటిఫై చేసింది. అయితే ప్రస్తుతం కేవలం 3 జిన్నింగ్ మిల్లుల వద్ద మాత్రమే పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. వాటి పరిధిలో 33 మెట్రిక్ టన్నుల పంటను మాత్రమే సీసీఐ కొనుగోలు చేసింది. అయితే, తరుగు తీస్తేనే పంటను కొనుగోలు చేస్తామన్న ఒప్పందంతో మాత్రమే ఆ పంటను సీసీఐ బయ్యర్లు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీంతో 'సీసీఐ కేంద్రాలు ఉన్నా.. మద్దతు ధర సున్నా..' అనే పరిస్థితి ఎదురవుతోంది.

### అదునుచూసి దెబ్బ కొడుతున్న ప్రైవేట్ ఖరీదుదారులు..

జిల్లా మార్కెటింగ్ శాఖ పరిధిలోని ఖమ్మం, ఏన్కూరు, మధిర వ్యవసాయ మార్కెట్లలో ప్రస్తుతం ప్రైవేట్‌లో పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. ప్రధానంగా ఖమ్మం ఏఎంసీలో భారీగా క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. కొత్త పంట మార్కెట్‌కు వచ్చే సమయంలో గరిష్ఠ ధర రూ.8 వేలకు పైగానే పలికింది. తేమ శాతంతో సంబంధం లేకుండానే ఖరీదుదారులు పత్తిని కొనుగోలు చేశారు. అయితే, సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావడం, అందులో అనేక కొర్రీలు పెడుతుండడం వంటి కారణాలతో రైతులు మళ్లీ ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. సీసీఐ మద్దతు ధర గరిష్ఠంగా రూ.7,520 కాగా.. ప్రైవేట్‌లో గరిష్ట ధర కేవలం రూ.7 వేలు మాత్రమే. దాదాపుగా పక్షం రోజులుగా ఖమ్మం ఏఎంసీ పత్తి యార్డులో దీనినే గరిష్ఠ ధరగా నమోదు చేస్తున్నప్పటికీ.. ఎక్కువ మంది రైతుల దగ్గర రూ.5,500 నుంచి రూ.6,500కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఈనామ్ ద్వారా ప్రైవేట్‌లో పత్తి కొనుగోళ్లు జరుగుతున్నప్పటికీ పెద్ద వ్యాపారులు కుమ్మక్కై సిండికేట్‌గా మారి పంటను కొనుగోలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అటు సీసీఐలో కొర్రీలు, ఇటు ప్రైవేట్‌లో సిండికేట్ దందా వంటి కారణాలతో 'రెంటికి చెడ్డ రేవడి'లా పత్తి రైతుల పరిస్థితి మారింది.

### పత్తి రైతులు కోలుకునేలా లేరు..



గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పత్తి పంట.. రైతులను కోలుకోని దెబ్బతీసింది. దిగుబడి పూర్తిగా తగ్గడం, మద్దతు ధర దక్కకపోవడం వంటివి రైతులను ఆగమాగం చేశాయి. ఈ పరిస్థితిలో రైతుకు సర్కారు సహాయం అందిస్తేనే వ్యవసాయం బాగుపడుతుంది. కానీ, ఈ ఏడాది సర్కారు నుంచి నయా పైసా సాయం అందలేదు. రైతుబంధు రాలేదు. రుణమాఫీ కాలేదు. ఈ ఏడాది ఐదు ఎకరాల్లో పత్తిని సాగు చేశాను. మొదటి దశలో 20 బస్తాలు మాత్రమే వచ్చింది. తీరా పంటను మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు క్వింటాకు రూ.6,900కు మాత్రమే కొన్నారు.

**–ఎస్‌కే నాగుల్‌మీరా, లచ్చగూడెం, చింతకాని**

## మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
### ఖమ్మం కలెక్టరేట్‌లో పలు ప్రారంభోత్సవాలు



ప్రారంభోత్సవాల సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మామిళ్లగూడెం, అక్టోబర్ 27: రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి ఖమ్మం కలెక్టరేట్‌లో టీస్టాల్, లేడీస్ లాంజ్, ఉద్యోగుల భోజనశాల, ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్, బస్టాప్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తామని, వారు తీసుకున్న రుణాలకు ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందని తెలిపారు. ఏటా స్వయం సహాయక సంఘాలకు రూ.20 వేల కోట్లను వడ్డీలేని రుణాలుగా అందిస్తామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీకి అవసరమైన అద్దె బస్సుల సరఫరాను ఇక నుంచి మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ.. మహిళాశక్తి క్యాంటీన్ ఏర్పాటు వల్ల ఇక్కడ 14 మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. జిల్లాలో గుర్తించిన ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళల అభివృద్ధి సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సుబ్బారావు, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఆర్‌వో రాజేశ్వరి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆ ఐదుగురిని విధుల్లోకి తీసుకోవాలి

### రాష్ట్రంలో 39 మంది కానిస్టేబుళ్ల సస్పెన్షన్ ఎత్తివేయాలి
### లేదంటే 9900 మందిమి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తాం
### చాతకొండ ఆరో బెటాలియన్ వద్ద రెండో రోజూ ధర్నా
### కార్యాలయం వద్ద రాత్రివేళ కొవ్వొత్తులతో ప్రదర్శన

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 27: నిరసన తెలిపిన ఐదుగురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సహచర కానిస్టేబుళ్లు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో పాల్గొన్న 39 మందిపై కూడా సస్పెన్షన్ వేటును తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా 9,900 మంది బెటాలియన్ పోలీసులం స్వచ్ఛందంగా రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు. తమ భర్తలతో వెట్టి చాకిరి చేయించొద్దని; ఒకే యూనీఫాం, ఒకే రూల్, ఒకే ఈవెంట్, ఒకే ఎగ్జామ్ ఉండాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ పోలీసుల భార్యలు, కుటుంబ సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బెటాలియన్ల వద్ద శనివారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన విషయం విదితమే. అందులో భాగంగా కొత్తగూడెంలోని చాతకొండ బెటాలియన్ లోనూ నిరసన వ్యక్తం చేశారు. అయితే, ఇందులో పాల్గొన్న కే.భూషణ్‌రావు, పులిరాజు, వెంకటేష్, నయీం, రవికిరణ్ అనే ఐదుగురు బెటాలియన్ కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అయితే తమ సమస్యలు పరిష్కరించాలని, ఈ ఐదుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం సరికాదని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సహచర కానిస్టేబుళ్లు ఆదివారం రెండో రోజూ ఆందోళనను కొనసాగించారు. కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పదే పదే బదిలీలు చేపట్టకుండా ఐదేళ్లపాటు ఒకే చోట విధులు నిర్వహించేలా అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఆరో బెటాలియన్ కమాండెంట్‌కు వినతిపత్రం అందించారు. ఇదే డిమాండ్‌పై సాయంత్రం వరకూ ధర్నాను కొనసాగించిన బెటాలియన్ కానిస్టేబుళ్లు.. ఆదివారం రాత్రి బెటాలియన్ ఆవరణలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు.



చాతకొండలో నిరసన తెలుపుతున్న ఆరో బెటాలియన్ సిబ్బంది





కార్యాలయం ఎదుట కొవ్వొత్తుల నిరసన తెలుపుతున్న బెటాలియన్ కానిస్టేబుళ్లు

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- 250 చదరపు గజాల ఇంటి స్థలం ఊసేలేదు
- రూ.25 వేల పెన్షన్ హామీకి గ్యారెంటీ లేదు
- ఖమ్మంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు

మామిళ్లగూడెం, అక్టోబర్ 27: ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలం, వారి కుటుంబాలకు రూ.25 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించి నేటివరకు వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. హామీలను వెంటనే అమలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాడ్ చేశారు. ఉద్యమకారులు పగడాల నరేందర్, బచ్చల పద్మాచారి, రాజమల్ల ఉమాయాదవ్, లింగనబోయిన సతీశ్, రెడ్డిబోయిన వరలక్ష్మి, బురాన్, శ్రీనివాస్‌నాయక్, ఆసిఫ్, విజయ్‌కుమార్, అనంతలక్ష్మి, స్వరూప, ధనలక్ష్మి పాల్గొన్నారు.



తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారులు

## జేకే 5 ఓసీకి ఫైవ్‌స్టార్ రేటింగ్


### 380 గనుల్లో ఈ రేటింగ్‌కు ఎంపికైన ఏకైక ఉపరితల గనిగా ఖ్యాతి
### ఇటీవల ఢిల్లీలో అవార్డు అందుకున్న సింగరేణి ఏరియా జీఎం జాన్
### పూసపల్లి వద్ద నూతన ఓసీకి సన్నాహాలు.. మరో 12 ఏళ్లపాటు ఉత్పత్తి



ఉద్యోగులతో కలిసి అవార్డు చూపిస్తున్న జీఎం జాన్ (ఫైల్)

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 27: ఇల్లెందు ఏరియా జేకే 5 ఓసీ ఫైవ్‌స్టార్ రేటింగ్‌కు ఎంపికైంది. ఏరియాకు గుండెకాయలాంటి జేకే ఓసీ మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంది. అనుభవజ్ఞులైన సూపర్‌వైజర్లు, శ్రమించి కష్టపడే ఉద్యోగులు, సూచనలు ఇచ్చే అధికారులు.. ఇలా ఏ ఒక్కరూ కూడా వెనుకడుగు వేయకుండా దేశంలోనే ఇల్లెందు ఏరియా పేరును మార్మోగించారు. కోలిండియా, సింగరేణి, ప్రభుత్వ, ప్రైవేట్ భూగర్భ ఉపరితల గనులకు సంబంధించి దేశ వ్యాప్తంగా 380 గనులు దరఖాస్తు చేసుకోగా.. తెలంగాణ నుంచి ఇల్లెందు ఏరియా జేకే 5 ఓసీ.. ఫైవ్‌స్టార్ రేటింగ్‌కు ఎంపికైంది. ప్రమాదరహిత గనుల్లో మేలైన వాటికే తిరిగి ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇస్తారు. అదే విధంగా రామగుండం ఆర్‌జీవోసీ–1 కూడా ఎంపికైంది. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఇల్లెందు తరపున ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డును అందుకున్నారు. గత 12 ఏళ్లుగా జేకే 5 ఓసీ బొగ్గు ఉత్పత్తిని సాధిస్తూ ఏరియా కీర్తిని ఇనుమడింపజేసింది. సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ అంచెలంచెలుగా ఎదిగింది. 2021–22లో 30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 24.97 లక్షల టన్నులు, 2022–23లో 14.50 లక్షల టన్నుల లక్ష్యానికిగాను 18.79 లక్షల టన్నుల చొప్పున జేకే 5 ఓసీ ఉత్పత్తి సాధించి ఏరియా సత్తాను చాటింది. ప్రస్తుతం ఈ సంవత్సరంలో ఇచ్చిన 6 లక్షల టన్నులకు గాను 2 లక్షల టన్నులను ఉత్పత్తి చేసింది. మిగతా సమయంలో సంస్థ నిర్దేశించిన లక్ష్యానికంటే ఎక్కువ బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు జేకే 5 ఓసీ సూపర్‌వైజర్లు, అధికారులు, ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి వరకు ఓసీ కాలపరిమితి ముగియడంతో జల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉంది. సింగరేణి ప్రయోగాత్మకంగా రూపొందించే జల విద్యుత్ ప్లాంట్ నిర్మాణం ఇల్లెందులో తొలిసారిగా ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు. జేకే 5 ఓసీకి ఫైవ్‌స్టార్ రేటింగ్ రావడంతో ఏరియా కార్మికులు, అధికారులు జిల్లా ప్రముఖుల ప్రశంసలను అందుకుంటున్నారు. కాగా, కాలపరిమితి వచ్చే సంవత్సరం ముగియడంతో పూసపల్లి ఓసీతో నూతన ఉపరితల గని ఏర్పాటు చేసి ఇల్లెందుకు మనుగడను కాపాడే దిశగా సింగరేణి అధికారులు ముందుకు సాగుతున్నారు. అనుకున్న సమయానికి నూతన ఓసీ ఏర్పాటైతే మరో 12 ఏళ్లపాటు ఎలాంటి ఢోకా లేకుండా బొగ్గు ఉత్పత్తి కొనసాగనుంది.

### పనిలో అంకిత భావానికి నిదర్శనం..



ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు, అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే నేడు దేశంలోనే ఫైవ్‌స్టార్ రేటింగ్ స్థానాన్ని జేకే 5 ఓసీ సొంతం చేసుకుంది. నిర్దేశిత లక్ష్యాలకు మించి అధికంగా బొగ్గు ఉత్పత్తి చేస్తూ ఇల్లెందు ఏరియా తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఫైవ్‌స్టార్ రేటింగ్ స్థానం సంపాదించడం అంటే ఆషామాషీ కాదు. పనిలో నిబద్ధత, అంకితభావం ఎంతో ముఖ్యం. ఇల్లెందు ఏరియా తరపున న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేకే 5 ఓసీ ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డును అందుకోవడం గర్వంగా ఉంది. **–జాన్ ఆనంద్, ఇల్లెందు ఏరియా జీఎం**

## పటాకుల అమ్మకాల్లో నిబంధనలు పాటించాలి

- ఉల్లంఘించిన వారిపై చర్యలు
- జిల్లా ఫైర్ ఆఫీసర్ క్రాంతి కుమార్




మురహరి క్రాంతి కుమార్

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 27: లైసెన్స్ ఉన్న విక్రేతల నుంచే దీపావళి పటాకులను కొనుగోలు భద్రాద్రి జిల్లా ఫైర్ అధికారి మురహరి క్రాంతికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భవనాలు, వాహనాలు, మండే స్వభావమున్న పదార్థాలకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే పటాకులు పేల్చాలని సూచించారు. పటాకులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలని, మంట సులువుగా అంటుకునేవి ధరించవద్దని, దగ్గరలో కనీసం బకెట్ నీరు కచ్చితంగా ఉంచుకోవాలని, చిన్న పిల్లల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పటాకులను కాల్చిన తరువాత వాటిపై నీరు పోస్తే నిప్పు రవ్వలు ఆరిపోతాయని అన్నారు. లైసెన్స్ లేకుండా పటాకులను విక్రయిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు.

## 5 ట్రేడ్లు.. 200 సీట్లు..

- మధిర సెగ్మెంట్‌లో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు ఉత్తర్వులు
- రూ.11.37 కోట్లతో ఐవోటీ స్మార్ట్ అగ్రికల్చర్ కోర్సులు

మధిర, అక్టోబర్ 27: మధిర నియోజకవర్గంలో ఏటా 200 మందికి వివిధ ట్రేడ్లలో నైపుణ్య శిక్షణ ఇచ్చేలా ఐటీఐ ఏర్పాటు కోసం అనుమతినిస్తూ కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రూ.11.37 కోట్లను భవన నిర్మాణం, తరగతి గదులు, యంత్ర సామగ్రి, వర్క్‌షాపు పుస్తకాలు, శిక్షణ నిధి సహా ఇతర ఖర్చుల కోసం వెచ్చించనున్నారు. కొత్త ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఐవోటీ స్మార్ట్ అగ్రికల్చర్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నారు. ఐటీఐలో శాశ్వత ప్రాతిపదికన ఒక ప్రిన్సిపాల్ సహా వివిధ స్థాయిల శిక్షణ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ సహా 21 పోస్టులు, పొరుగు సేవల కింద మరో ఐదు పోస్టులు మంజూరయ్యాయి. అయితే, ఈ ఐటీఐని మధిర నియోజకవర్గ ఎక్కడ ఏర్పాటు చేస్తారనే అంశంపై ఆ జీవోలో వెల్లడించలేదు.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Labour Employment Training and Factories Department – Establishment of new Government ITI at Madhira Constituency, Khammam District – Administrative Sanction - Accorded - Orders - Issued.

LABOUR EMPLOYMENT TRAINING AND FACTORIES (EMP-VIG) DEPARTMENT

G.O.Ms.No. 17 Dated: 25-10-2024.
Read:-

From the DET, Hyd. Lr.No. B1/JD PESHI/2024, dt:02.08.2024.

*****

ORDER:

In the letter read above, the Director of Employment and Training, Hyderabad has submitted a detailed proposal for establishment of new Government Industrial Training Institute (ITI) at Madhira Constituency, Khammam District with certain trades and staffing pattern mentioned therein.

2. Government after careful examination of the proposal, hereby accord administrative sanction for establishment of new Government ITI at Madhira Constituency, Khammam District at an expenditure of ₹.11,37,21,033/- (Non-Recurring - ₹.10,31,00,000 /- & Recurring - ₹.1,06,21,033/- ) with the following trades and staffing pattern:

TRADES:

| Sl. | Trade | Duration of Course | Engg./Non-Engg. | Units. | Strength |
|---|---|---|---|---|---|
| 1 | Electrician | 2 Yrs. | Engg. | 2 (1+1) | 40 |
| 2 | Fitter | 2 Yrs. | Engg. | 2 (1+1) | 40 |
| 3 | IOT Smart Agriculture | 1 Yr. | Engg. | 2 (1+1) | 40 |
| 4 | Fashion Design & Technology | 1 Yr. | No. Engg. | 1(1+1) | 40 |
| 5 | Mechanic Electric Vehicle | 1Yr. | Engg. | 2(1+1) | 40 |
| | | | | Total | 200 |

STAFFING PATTERN:

| Sl. No | Name of the post | No. of posts | Scale of pay (in Rs.) |
|---|---|---|---|
| | Regular: | | |
| 1 | Principal | 01 | 51320-127310 |
| 2 | Training Officer | 01 | 43490-118230 |
| 3 | Deputy Training Officer | 05 | 38890-112510 |
| 4 | Assistant Training Officer | 05 | 33750-99310 |
| 5 | Assistant Training Officer (Maths) | 01 | 33750-99310 |
| 6 | Assistant Training Officer (Engg.Drawing) | 01 | 33750-99310 |
| 7 | Assistant Training Officer (Employability Skills) | 01 | 33750-99310 |
| 8 | Technical Assistant | 01 | 22900-69150 |

ఉత్తర్వుల కాపీ

## పుల్లయ్య అక్రమ అరెస్టుకు నిరసనగా ప్రొద్దుటూరులో కొవ్వొత్తుల ర్యాలీ

చింతకాని, అక్టోబర్ 27: బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అక్రమ అరెస్టును నిరసిస్తూ ప్రొద్దుటూరు గ్రామంలో అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు ఆదివారం కొవ్వొత్తుల శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతు మృతిచెందితే ఎక్స్‌గ్రేషియా కోసం నిరసనలో పాల్గొన్న నాయకులు, వ్యక్తులను అరెస్టు చేయడం సమజసం కాదన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను అరెస్టు చేయడం ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యేనని విమర్శించారు. ఈ అక్రమ అరెస్టులను తామంతా వ్యతిరేకిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులు